క్లుప్తంగా

1న శనీశ్వరుడికి తైలాభిషేకం

మదనపల్లె సిటీ : శనిత్రయోదశిని పురస్కరించుకుని జూలై 1న(శనివారం) శనీశ్వరస్వామికి తైలాభిషేకం నిర్వహిస్తున్నట్లు స్థానిక యోగభోగేశ్వరస్వామి ఆలయ అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ తెలిపారు. అలాగే యోగభోగేశ్వరస్వామికి తైలాభిషేకం, రుద్రాభిషేకం, ప్రదోషంలో బాహ్య నందీశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని ఆయన కోరారు.

సల్లాపురమ్మకు బోనాల సమర్పణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కలికిరి : మండలంలోని పత్తేగడ గ్రామం కొటాలలో వెలసిన సల్లాపురమ్మ జాతర ఉత్సవంలో భాగంగా గురువారం అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. కొటాలలో ఇంటింటి నుంచి భక్తులు బోనాలు తీసుకెళ్లి సల్లాపురమ్మకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం రాత్రి చాందినీబండ్లు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బళ్ళారి డ్రమ్స్ వాయిద్యాల నడుమ ఊరేగింపు చేశాయి. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆలయానికి ఇన్వర్టర్ వితరణ

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై గల శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె లైఫ్‌కేర్ మెడికల్ నాగసుబ్రమణ్యం, శేషుకుమార్‌లు రూ.20 వేలు విలువ చేసే ఇన్వర్టర్‌ను వితరణగా ఇచ్చారు. గురువారం వారు మల్లయ్యకొండకు చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఇన్వర్టర్‌ను పూజారి ఈశ్వరప్పకు అందజేశారు. వారిని ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ఈవో రమణ, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, కొండ కిట్ట, భక్తులు అభినందించారు.

నేడు వాహనాల వేలం

మదనపల్లె : పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్(ఎస్ఈబీ)లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో ఉదయం 10 గంటలకు ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో వాహనాల వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు మదనపల్లె ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్‌ను 9440902595 అనే ఫోన్ నంబర్‌పై సంప్రదించాలన్నారు.

మెరుగైన పీఆర్‌సీ ఇవ్వాలి

మదనపల్లె సిటీ : విద్యుత్ కార్మికులకు మెరుగైన పీఆర్‌సీ ఇవ్వాలని 1104 ఎస్పీడీసీఎల్ డిస్కం అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక రామారావుకాలనీలో ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. అందరూ కలిసి యూనియన్ బలోపేతం చేయాలని పేర్కొన్నారు. మదనపల్లె డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బి.శంకర్‌రెడ్డి, కార్యదర్శిగా జాఫర్‌వల్లి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రీజనల్ నాయకులు గణేష్‌బాబు, రవీంద్ర, బ్రహ్మానందయ్య, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

కాలువలో పడి.. తల్లడిల్లి



ఆవును బయటకు తీస్తున్న స్థానికులు

కురబలకోట : మండలంలోని అంగళ్లు కదిరి రోడ్డు పక్కన మేతకు వెళ్లిన ఓ పాడి ఆవు ప్రమాదవశాత్తు గురువారం సిమెంటుతో కట్టిన సైడు కాలువలో పడి ఇరుక్కుపోయింది. బయటకు రాలేక నరకయాతన పడింది. అటుగా వెళుతున్న స్థానికులు గమనించారు. మండలంలోని మట్లివారిపల్లె గ్రామం ఎర్రమద్దివారిపల్లె జ్యోతికి చెందిన ఆవుగా గుర్తించారు. దీనికి కట్టెల సాయంతో తాళ్లు కట్టి బయటకు తీశారు. స్వల్ప గాయాలతో బతుకు జీవుడా అంటూ ఆ ఆవు ఊపిరి పీల్చుకుంది. యజమాని వెంట ఇంటి ముఖం పట్టింది.

రేపు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

పెద్దమండ్యం : స్థానిక మోడల్ పాఠశాలలో 7, 8, 9, 10 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామాంజులు నాయక్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు పాఠశాలకు చేరుకోవాలని చెప్పారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా, రోస్టర్ విధానం మేరకు సీట్లను భర్తీ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రవక్త ఇబ్రహీం త్యాగం.. ఆదర్శనీయం



తంబళ్లపల్లె : ఈద్గా వద్ద ధార్మికోపాన్యాసం చేస్తున్న హజరత్ యూసఫ్



మదనపల్లె సిటీ : ఈద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



వాల్మీకిపురం: బక్రీద్ శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

- జామియా మసీదు ఇమామ్ ముఫ్తీ జలాలుద్దీన్
- భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

మదనపల్లె సిటీ : ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగం విశ్వమానవాళికి ఆదర్శనీయమని జామియా మసీదు ఖతీబ్-ఒ-ఇమామ్ ముఫ్తీ జలాలుద్దీన్ అన్నారు. గురువారం ముస్లింల పర్వదినమైన బక్రీద్‌ను పురస్కరించుకుని స్థానిక బెంగుళూరు రోడ్డులోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధార్మికోపన్యాసం చేస్తూ బక్రీద్ పండుగ విశిష్టతను తెలియజేశారు. అంతకు ముందు ముస్లింలు జామియా మసీదు వద్దకు చేరుకుని అక్కడి నుంచి తక్బీర్‌ను పఠిస్తూ ఈద్గా మైదానానికి చేరుకున్నారు. విశ్వశాంతి కోసం ప్రార్థనలు చేశారు. ప్రార్థనల్లో ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జి.రఫీ, బాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని అన్ని మసీదులతోపాటు రూరల్ పరిధిలోని డ్రైవర్స్‌కాలనీ, పోతబోలు, ఆరోగ్యవరం, సీటీఎంలలోని మసీదులలో ప్రార్థనలు నిర్వహించారు. డ్రైవర్స్ కాలనీలో జరిగిన ప్రార్థనల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

మదనపల్లె : ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంటికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. పలువురు పుష్పగుచ్ఛాలు, బొకేలు అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెమ్మ, వెలుగుచంద్ర, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, మాజీ ఆర్‌ఐ రమణారెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ తట్టిశారదమ్మ, డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిష్‌రామకృష్ణారెడ్డి, ఎం.వి.రమణ, కరీముల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు బండిమనోహర్, శ్రీకాంత్, ఆనంద్, రెడ్డిశేఖర్, ఆర్టీసీ-1,2 డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

అల్లాహ్ అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలి

వాల్మీకిపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలతోపాటు నియోజకవర్గ ప్రజలపై అల్లాహ్ అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. స్థానిక ముస్లిం మైనార్టీలకు ఆయన బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, నాయకులు ఇలియాజ్, సమీ, ఇమ్రాన్, బాల, బాబు, అలీ అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

■ స్థానిక బైపాస్ రోడ్డు, నమాజ్‌కట్టవీధి, హసన్‌ఖాన్‌వీధి, పునుగుపల్లె, చింతపర్తి, గండబోయనపల్లె తదితర గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దివ్య త్యాగాలకు ప్రతీక బక్రీద్

కలికిరి : దివ్య త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ అన్నారు. కలికిరి సమీపంలో నూతన ఈద్గా వద్ద బక్రీద్ ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కలికిరితోపాటు మహల్, గుట్టపాళెం, మేడికుర్తి, టి.సంగ్రావారిపల్లి, గుండ్లూరు, మర్రికుంటపల్లి, గడి గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొని, పెద్దల సమాధుల వద్ద నివాళులు అర్పించారు.

స్వార్థం వీడాలి

తంబళ్లపల్లె : స్వార్థాన్ని వీడి నిస్వార్థ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని మత గురువు హజరత్ యూసఫ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఈద్గాలో ఆయన ధార్మికోపాన్యాసం చేశారు. కుక్కరాజుపల్లె, రేణుమాకులపల్లె, కోసువారిపల్లె, గంగిరెడ్డిపల్లె, కొటాల పంచాయతీలలో ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల నుంచి ఊరేగింపుగా ఈద్గాకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మైనుద్దీన్, జమాల్ బాషా, అమీన్‌పీర్, షాదిక్, ముజీబ్ పాల్గొన్నారు.



పీలేరు : ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పీలేరు : స్థానిక మదనపల్లె మార్గంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు సమాజంలోని ప్రజలకు శాంతి సౌభాగ్యాలు ప్రసాదించు అల్లా అంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేదలకు తమ శక్తికొద్ది ఖుర్బానీని పంచిపెట్టారు. అలాగే మండలంలోని బోడుమల్లువారిపల్లె, తలపుల, రేగళ్లు, శివరామపురం, ఒంటిల్లు తదితర ప్రాంతాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

కేవీపల్లె : మండలంలో ముస్లింలు అధికంగా ఉన్న వగళ్ల, లక్ష్మిరెడ్డిగారిపల్లె, మారేళ్ల, నూతనకాల్వ, కేవీపల్లె, గుర్రెడ్డిగారిపల్లె, తురకపల్లె, గర్నిమిట్ట తదితర గ్రామాలలో బక్రీద్ పండుగను జరుపుకొన్నారు.

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండ, తరిగొండ, మర్రిపాడు, చెర్లోపల్లె, సంగసముద్రం, టి.రాచపల్లె, శెట్టివారిపల్లె, అమిలేపల్లే, ఖండ్రిగ గ్రామాల్లో ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లోని మసీదుల వద్దకు ముస్లింలు పెద్ద ఎత్తున చేరుకొన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా ఈద్గాల వద్దకు చేరుకొని సామూహికంగా నమాజ్‌ను చదువుకొన్నారు. ఎస్‌ఐ దిలీప్‌కుమార్ ఈద్గాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

పెద్దమండ్యం : మండలంలోని పెద్దమండ్యం, పాపేపల్లె, కలిచెర్ల, సిద్దవరం, తురకపల్లె, ముసలికుంట ప్రాంతాలలో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దమండ్యంలో సర్పంచ్ ఎస్ బాబా, మండల కో ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ, ఎస్‌వో పల్లె మాజీ సర్పంచ్ నజీర్ అహ్మద్, ప్రభుత్వ సర్కాజీ ఎస్ఎండి ఇస్మాయిల్, మండల కన్వీనర్ చాంద్‌బాషా, ఆర్‌బీకే అధ్యక్షుడు చాను ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలను తెలియజేశారు.

ములకలచెరువు : మండలంలోని ములకలచెరువు, సోంపల్లి, చౌడసముద్రం, కాలువపల్లి, పెద్దపాళ్యం, వేపూరికోట, దేవులచెరువు, బురకాయలకోటలోని ముస్లింలు ఈద్గా వద్దకు ఉదయం 9 గంటలకు చేరుకున్నారు. ప్రజలు మంచి మార్గంలో నడవాలని, ఖురాన్ ప్రాముఖ్యతను మత గురువులు వివరించారు. అనంతరం వర్షాలు కురవాలని, ప్రజలకు మంచిరోజులు రావాలని ప్రత్యేక ప్రార్థనలు చేయించారు.

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు, మద్దయ్యగారిపల్లి, పీటీఎం, చెన్నరాయునిపల్లి, విసనకర్రవాండ్లపల్లి తదితర గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు.

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె, కొండయ్యగారిపల్లె, సైదాపేట, రాచవేటివారిపల్లె, చౌకిళ్లపల్లె, ముష్టూరు, చల్లావారిపల్లె, సింగంవారిపల్లె, సాకిబండవారిపల్లె, తురకపల్లె తదితర గ్రామాల్లో ముస్లింలు ఊరేగింపుగా ఈద్గాలకు వెళ్లారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రామసముద్రం : మండల కేంద్రంలో ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు. ముస్లింలంతా కలసి దిగువపేట మసీదు నుంచి చెక్ పోస్టు మీదుగా శ్రీనివాసపురం రోడ్డులోని ఈద్గా మైదానంకు ర్యాలీగా చేరుకుని ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్ద ముతవల్లి సిరాజ్‌బాషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరి పట్ల జాలి, దయ కలిగి ఉండటమే పండగ ఉద్దేశమన్నారు. బక్రీద్ పర్వదినం రోజున ఖుర్బాని ఇచ్చే ముస్లింలకు ఎంతో పుణ్యఫలం లభిస్తుందన్నారు. అలాగే చెంబకూరు, ఎం.గొల్లపల్లి గ్రామాల్లో బక్రీద్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ముతవల్లి సిరాజ్‌బాషా, మహబూబ్ బాషా, అల్తాఫ్, షాబుద్దిన్‌బాషా, కె.సిరాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కలకడ : కలకడ, కోన, నడిమిచెర్ల, పాపిరెడ్డిగారిపల్లె, ముడియంవారిపల్లె పంచాయతీలలోని ఈద్గా మైదానాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థన మందిరాలకు అధికంగా ముస్లింలు హాజరు కావడంతో ఎస్‌ఐ సిటిస్వామి ట్రాఫిక్ నియంత్రణ చేశారు.

కురబలకోట : మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు నిర్వహించారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.



కలికిరి : బక్రీద్ పర్వదిన ప్రాముఖ్యతను వివరిస్తున్న మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్



ముస్లింను ఆలింగనం చేసుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి

కనుల పండువగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. గురువారం స్వాతి నక్షత్రం కావడం, ఇదే రోజు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు ఆకట్టుకుంది. ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగళ్యధారణ గావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గోపాలాబట్టర్, కృష్ణ, అనిల్, రాజు, గోకుల్ స్వాములు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణాంకాల దినోత్సవం



మహలనోబిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రమాదేవి

మదనపల్లె : స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో గురువారం బెంగాల్‌కు చెందిన గణాంక శాస్త్రవేత్త ప్రశాంత చంద్ర మహలనోబిస్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణాంకాల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ రమాదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో మానవ కార్యకలాపాలన్నీ గణాంకాలు (స్టాటిస్టిక్స్) ఆధారంగానే నిర్వహించగలుగుతున్నామన్నారు. జాతీయ గణాంక వ్యవస్థను స్థాపించడంలో ప్రొఫెసర్ మహలనోబిస్ చేసిన కృషికి గుర్తింపుగా ఆయన జయంతి సందర్భంగా ఏటా జూన్ 29న జాతీయ గణాంకాల దినోత్సవం(నేషనల్ స్టాటిస్టిక్స్‌డే) జరుపుకొంటున్నామన్నారు. భారతదేశ మొదటి ప్లానింగ్ కమిషన్ సభ్యుడిగా, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ స్థాపకుడిగా ఆయన అందరికీ సుపరిచితుడన్నారు. మహలనోబిస్ దూరం, గణాంక కొలత తదితర గణాంక పరిశోధనలు ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతి పొందాయన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ పోటీల్లో ప్రతిభ కనపరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాఘవేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆజాద్ హత్యకు కుట్ర



మాట్లాడుతున్న వీసీకే పార్టీ నాయకుడు శివప్రసాద్

మదనపల్లె : భీమ్ ఆర్మీ చీఫ్, ఆజాద్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ ఆజాద్ హత్యకు యోగీ ఆదిత్యనాథ్ సర్కార్ కుట్ర చేస్తోందని, సహరాన్‌పూర్‌లో ఆయనపై జరిగిన తుపాకుల దాడి ఇందులో భాగమేనని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ ఆరోపించారు. చంద్రశేఖర్ ఆజాద్‌పై హత్యాప్రయత్నాన్ని ఖండిస్తూ వీసీకే పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరభారతంలో ఆజాద్ బలమైన నాయకుడని, ఆజాద్ సమాజ్ పార్టీని స్థాపించి ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో పోటీ చేశాడన్నారు. మనువాద భావజాలాన్ని తీవ్రంగా వ్యతిరేకించే ఆజాద్ అంటే బీజేపీ, ఆరెస్సెస్, సంఘపరివార్ గుంపులకు గిట్టదన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఆజాద్ విస్తృతంగా ప్రచారం చేసే అవకాశం ఉన్నందున సంఘ్ పరివార్ గుంపులను ఉసిగొల్పి ఆజాద్‌ను హత్యచేయించాలని యోగీ సర్కార్ కుట్రలు చేస్తోందన్నారు. అందులోభాగంగానే ఆయన సహరాన్‌పూర్‌లో ఓ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా, ఆజాద్ కారుమీద సంఘ్ పరివార్ వారు తుపాకులతో కాల్పులు జరిపారన్నారు. సమావేశంలో వీసీకే పార్టీ నేతలు ముత్యాలమోహన్, సొన్నికంటిరెడ్డెప్ప, గిన్నెలమనోహర్‌రెడ్డి, రాయల్ సూర్యలు పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

పీలేరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శుక్రవారం మండలంలోని మేళ్లచెరువు పంచాయతీలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మేళ్లచెరువు పంచాయతీలోని నల్లగుట్టపల్లె, చీపాటివారిపల్లె, చెన్నప్పగారిపల్లె, మేళ్లచెరువు కస్బా, బలిజపల్లెలో పర్యటిస్తారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

అలరించిన అర్జున తపస్సు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న మహాభారతయజ్ఞ కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం అర్జున తపస్సు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహాభారత యజ్ఞం నిర్వహిస్తున్న ప్రాంతంలో తపస్మాన్ ఏర్పాటు చేశారు. ద్రౌపతి సమేత పాండవులు, శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి భక్తి శ్రద్ధలతో తపస్మాన్ వద్దకు తీసుకువచ్చారు. తపస్మాన్ వద్ద అర్జునుడు, శివపార్వతుల వేషధారులు, యజ్ఞ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్జున వేషధారుడు కౌరవులపై విజయం సాధించడానికి శివున్ని మెప్పించి పశుపదార్థం సాధించే తపస్సు ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అర్జునుడు ఒక్కో మెట్టు ఎక్కుతూ పాడిన పద్యాలు భక్తులను కట్టిపడేశాయి. అర్జున వేషధారి తపస్మాన్ పైకి ఎక్కి అక్కడి నుంచి నిమ్మకాయలు, వివిధ రకాల పండ్లు, విబూది, మిఠాయిలు విసిరారు. అవి దక్కిన వారికి శుభం కల్గుతుందనే నమ్మకంతో భక్తులు వాటికోసం పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గజ్జెల శీన్‌రెడ్డి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

పోస్ట్‌మాస్టర్ విశ్వనాథం సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న సర్కిల్ సెక్రటరీ శ్రీధర్‌బాబు

వాల్మీకిపురం : వాల్మీకిపురం పోస్టుమాస్టర్ విశ్వనాథం సేవలు మరువలేనివని సర్కిల్ సెక్రటరీ శ్రీధర్ బాబు అన్నారు. గురువారం పోస్టుమాస్టర్ విశ్వనాథం పదవీ విరమణ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వనాథం 1991లో బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా చేరి ప్రజలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐపీఈయూ ప్రధాన కార్యదర్శి సరత్ కుమార్, సర్కిల్ అధ్యక్షులు మురళి, డివిజన్ అధ్యక్షులు శేషాద్రి, సిబ్బంది కమల్‌నాథ్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి




రామసముద్రం : పూజలందుకుంటున్న చెంబకూరు శ్రీగట్టు వెంకటరమణస్వామి

రామసముద్రం : మదనపల్లె క్లస్టర్ పరిధిలోని పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో గురువారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామసముద్రంలోని శ్రీ లక్ష్మీజనార్దనస్వామి, చెంబకూరులోని శ్రీగట్టు వెంకటరమణ స్వామి, మినికి గ్రామంలోని శ్రీ కల్యాణ వెంకటరమణ స్వామి తదితర రామాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉపవాస దీక్షలతో ఆలయాలకు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మదనపల్లె సిటీ : స్థానిక దేవళం వీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు గోవర్ధన్‌భట్టార్ అభిషేకాలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ పంచాయతీ చెరువుమొరవపల్లెలోని శ్రీ ఆంజినేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి స్వామి వారికి ఘనంగా ఆకు పూజ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెడ్డిసంఘం గౌరవాధ్యక్షులు నారదరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ ఎల్లారెడ్డి, ఆలయ అర్చకులు గోపాలాబట్టర్, అనిల్ స్వాములు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి



గ్రామ వలంటీర్లకు డివైజ్‌లు పంపిణీ చేస్తున్న జి.వి.రాకేష్‌రెడ్డి

పీలేరు రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యువ పారిశ్రామికవేత్త జి.వి.రాకేష్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక 3వ గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సర్వీస్ ఫీజు లేకుండా జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, లావాదేవీ మ్యుటేషన్లు, ఆధార్‌కు నంబరు అనుసంధానం, సీసీఆర్‌సీ కార్డులు, కొత్తరేషన్ కార్డులు, కార్డుల విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ సచివాలయ పరిధిలో పని చేస్తున్న పది మంది వలంటీర్లకు తమ సొంత నిధులతో బయోమెట్రిక్ డివైజ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జునరెడ్డి, జయచంద్రారెడ్డి, సాంబశివారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ఎం.అరుణ తదితరులు పాల్గొన్నారు.